సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 5 । నవంబర్ । 2023

ఎన్నికల వ్యయ పరిశీలకులను కలిసిన ఎస్పీ



ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం జిల్లాకు చేరుకున్న వ్యయ పరిశీలకులు ప్రద్యాశీల్ రాంరావ్ జుంలేను స్థానిక పెన్‌గంగా గెస్ట్‌హౌస్‌లో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం కలిశారు.



బతుకమ్మ సంబురాలు

జిల్లాలో పలుచోట్ల బతుకమ్మ సంబురాలను శనివారం ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. 11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/18.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ఆలోచించి ఓటేయండి



మాట్లాడుతున్న ఆకునూరి మురళి

ఇచ్చోడ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బాగా ఆలోచించి ఓటు వేయాలని జాగో తెలంగాణ బస్సుయాత్ర కన్వీనర్ ఆకునూరి మురళి అన్నారు. బస్సుయాత్ర శనివారం ఇచ్చోడకు వచ్చిన సందర్భంగా అంబేద్కర్ చౌక్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణలో జరుగుతున్న అవినీతి, ఆర్థిక రాజకీయాలను ఓడించాలన్నారు. డబ్బు, కులం, మతానికి లోబడకుండా ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. యువత తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట బస్సుయాత్ర సభ్యులు పాల్గొన్నారు.

గడువులోపు 'పది' ఫీజు చెల్లించాలి

ఎదులాపురం: గడువులోపు పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించాలని డీఈవో ప్రణీత, ప్రభుత్వ పరీక్షల సహాయ నిర్వహణ అధికారి వేణుగోపాల్ శనివారం ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.125, ఫెయిల్ అయిన విద్యార్థులు మూడు, అంతకంటే తక్కువ సబెక్టులు ఉంటే రూ.110, మూడు కంటే ఎక్కువ ఉంటే రూ.125, వొకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజుతో పాటు అదనంగా రూ.60 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 17వరకు ఎలాంటి అపరాద రుసుము లేకుండా, డిసెంబర్ 1వరకు రూ.50, 11వ తేదీ వరకు రూ.200, 20వ తేదీ వరకు రూ.500 అపరాద రుసుముతో చెల్లించవచ్చని తెలిపారు. విద్యార్థుల ఎస్‌ఆర్‌ఎస్ సబ్మిషన్‌లో ఈ సారి మార్పులు జరిగాయని, వీటిని ప్రధానోపాధ్యాయలు గమనించాలని డీఈవో పేర్కొన్నారు.

నేడు నామినేషన్లు స్వీకరించబడవు



రిజిస్టర్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఈ నెల 5వ తేదీన (ఆదివారం) సెలవురోజు అయినందున నామినేషన్లు స్వీకరించబడవని ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదిలాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదిలాబాద్, బోథ్ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో శనివారం నామినేషన్లు దాఖలు కాలేదని వెల్లడించారు. ఇందులో రిటర్నింగ్ అధికారి బి. స్రవంతి పాల్గొన్నారు.

సుముహూర్తం

- నామినేషన్ దాఖలుకు మంచి రోజు కోసం సంప్రదింపులు
- వేదపండితులను ఆశ్రయియిస్తున్న అభ్యర్థులు
- ముఖ్యనేతలను ఆహ్వానించేందుకు ఏర్పాట్లు

జంగ్ తెలంగాణ



సాక్షి,ఆదిలాబాద్: ఎన్నికల నామినేషన్ వేసేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు మంచిరోజు కోసం సంప్రదింపులు చేస్తున్నారు. వేదపండితులను ఆశ్రయించి తమ జాతక రీత్యా ఏ రోజు వేస్తే బాగుంటుందని ఆరా తీస్తున్నారు. ఒకటికి రెండు సార్లు సమాలోచనలు చేస్తూ బలమైన ముహూర్తానికి నామినేషన్ వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అంతకుముందు నామమాత్రంగా ఓ సెట్‌ను దాఖలు చేస్తున్నారు. ఈ నెల 10 వరకు గడువు ఉండగా అందులో దివ్య ముహూర్తాలను అన్వేషిస్తున్నారు.

చివరి రెండు రోజుల్లోనే..

నామినేషన్‌ల ఘట్టం ఈనెల 3న మొదలైంది. వారం పాటు కొనసాగనుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ముహూర్త విషయంలో వేదపండితులను ఆశ్రయించి నామినేషన్ వేసేందుకు సిద్ధం అవుతున్నారు. ప్రధానంగా తిథి, నక్షత్రం, యోగం, భరణం అన్ని సరిగ్గా ఉన్న రోజును ఎంచుకుంటున్నారు. చివరి రెండు రోజులు గురు, శుక్రవారాల్లో ముహూర్తం బాగుండటంతో పలువురు అదే రోజుల్లో వేసేందుకు ప్రణాళిక చేస్తున్నారు. 9న ఏకాదశి వస్తున్నప్పటికీ ముహూర్తం మధ్యమంగా ఉందని వేదపండితులు చికిలి వెంకటేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. 10వ తేదీన ద్వాదశి వస్తుందని అన్ని అనువుగా ఉన్నాయని వివరించారు. ఈ రెండు రోజుల్లో ఒక్కో సెట్టు నామినేషన్ వేసినా బాగుంటుందని తెలుపుతున్నారు. ఇదిలా ఉంటే 6వ తేదీ రోజు కూడా కొంత అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు సిద్ధం అవుతున్నారు.

ఆ రోజు హంగామే..

నామినేషన్ వేసే రోజు కూడా మంది మార్బలంతో ర్యాలీగా బయల్దేరి హంగామా చేయాలని అభ్యర్థులు ఆలోచన చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థులు ఆ పార్టీ జాతీయ నాయకులు బండి సంజయ్‌ను నామినేషన్ రోజు ఇక్కడికి రావాలని ఆహ్వానిస్తున్నారు. మిగతా పార్టీల నేతలు జన సమీకరణ విషయంలో ప్రణాళిక రూపొందిస్తున్నారు. మొత్తంగా నామినేషన్ రోజు హడావుడి చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

ప్రచారానికి ప్రణాళికలు..

నామినేషన్‌ల ఘట్టం పూర్తయిన తర్వాత ప్రచార పర్వంలో దూకుడు మరింత పెంచేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రణాళిక చేస్తున్నారు. బీఆర్‌ఎస్‌కు సంబంధించి ఇటీవలే రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు జిల్లాలో పర్యటించారు. తాజాగా సీఎం కేసీఆర్ పర్యటనకు సంబంధించి తేదీ సైతం ఖరారైంది. ఇక బీజేపీకి సంబంధించి ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, బండి సంజయ్, రాజాసింగ్, ఇతర ముఖ్య నాయకుల పర్యటన జిల్లాలో ఉంటుందని చెబుతున్నారు. ఇటీవలే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పాటు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర ముఖ్యనేతలు ఆదిలాబాద్ బహిరంగ సభలో పాల్గొన్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ పరంగా ఓ భారీ బహిరంగ సభ నిర్వహించాలని ఆదిలాబాద్ అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. జాతీయ నాయకులు ఈ సభలో పాల్గొనే విధంగా ప్రణాళిక చేస్తున్నారని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నారు.

సామాన్యుల సొమ్మే అధికం..!



స్వాధీనం చేసుకున్న నగదు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు (ఫైల్)

- తనిఖీల్లో పట్టుబడుతున్న డబ్బు
- రూ.50వేలకు మించితే సీజ్ చేస్తున్న ప్రత్యేక బృందాలు
- ఆధారాలు చూపితే 48 గంటల్లో వాపస్
- కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌సెల్
- సగానికిపైగా నగదు తిరిగి అందజేత

కైలాస్‌నగర్: అసెంబ్లీఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఎన్నికల సంఘం సంకల్పించింది. ఈమేరకు అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచే ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేసింది. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.50వేలకు మించి నగదును సీజ్ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.కోటికి పైగా నగదు పట్టుకున్నారు. ఇందులో సామాన్యుల సొమ్మే ఎక్కువగా ఉండటంతో దాన్ని తిరిగి ఇచ్చేందుకు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేశారు. సరైన పత్రాలు చూపించిన వారికి 48 గంటల్లో వాపస్ చేస్తున్నారు. ఇప్పటివరకు సగానికి పైగా నగదు తిరిగి ఇచ్చేశారు.

ముమ్మర తనిఖీలు

అసెంబ్లీ ఎన్నికల నిర్వాహణకు కేంద్ర ఎన్నికల సంఘం అక్టోబర్ 11న షెడ్యూల్ ప్రకటించింది. వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి రావడంతో జిల్లాకు మద్యం, నగదు అక్రమంగా తరలిరాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. మహారాష్ట్రను ఆనుకొని ఉండే భీంపూర్, తలమడుగు, బోథ్, గాదిగూడ, జైనథ్, బేల మండలాల్లో ఏడు ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. అటవీశాఖ, పోలీస్, ఎక్సైజ్ అధికారులు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తూ తనిఖీలు చేపడుతున్నారు. ఇటీవల ఎన్నికల నోటిఫికేషన్ సైతం ప్రకటించడంతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు సైతం రంగంలోకి దిగాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.50 వేలకు మించి నగదు ఉంటే సీజ్ చేస్తున్నారు. పట్టుబడ్డ నగదు రూ.పది లక్షల వరకు ఉంటే బ్యాంకుల్లో జమ చేస్తున్నారు. బ్యాంకు సమయం మించిపోతే ట్రెజరీ కార్యాలయంలో డిపాజిట్ చేస్తున్నారు. రూ.పది లక్షలకు మించి ఉంటే ఆదాయపు పన్నులశాఖ అధికారులకు అప్పగిస్తున్నారు. ఇటీవల రోల్‌మామడ వద్ద పట్టుబడ్డ రూ.40లక్షలను ఐటీ శాఖకు అప్పగించారు. నామినేషన్లు ముగిసి ప్రచారం ఊపందుకుంటే మరింత పెద్ద ఎత్తున నగదు పట్టుబడే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ.96 లక్షలు తిరిగి ఇచ్చేశారు

జిల్లావ్యాప్తంగా 31 కేసులను నమోదు చేసిన అధికారులు రూ.1కోటి 37లక్షల 10వేల 150లను సీజ్ చేశారు. ఇందులో సామాన్యులకు సంబంధించిన నగదు తిరిగి ఇచ్చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. జిల్లాస్థాయిలో ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటుకు ఆదేశించింది. ఈ మేరకు జిల్లా సహకార అధికారి బి.మోహన్ కన్వీనర్‌గా, జెడ్పీసీఈవో బి.గణపతి, డీటీవో హారిక సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేశారు. సీజ్ చేసిన డబ్బుకు సంబంధించిన బాధితులు తగు ఆధారాలు సమర్పిస్తే 48 గంటల్లో ఆ నగదు తిరిగి ఇచ్చేయాలని కమిటీకి జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన కమిటీ సభ్యులు రూ.40 లక్షలను ఐటీ అధికారులకు అప్పగించారు. మిగతా రూ.97,10,150 నగదు ఉండగా కమిటీకి అందిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు, బాధితులు సమర్పించిన ఆధారాలను పరిశీలించి అందులో 29 మందికి సంబంధించి రూ.96,10,150 నగదు తిరిగి వారికి వాపస్ చేశారు. ఇంకా అధికారుల వద్ద ఒక కేసుకు సంబంధించి రూ.లక్ష నగదు మాత్రమే అందించాల్సి ఉంది. ఈ లెక్కలను పరిశీలిస్తే తనిఖీల్లో పట్టుబడ్డ సొమ్ము అంతా సామాన్యులదేనని స్పష్టమవుతుంది.

ఆధారాలు అందజేస్తే నగదు వాపస్

తనిఖీల్లో సీజ్ చేసిన డబ్బుకు సంబంధించిన బాధితులు వాటిని ఏ పని కోసం, ఎక్కడి నుంచి తీసుకెళుతున్నారనే ఆధారాలు అందజేస్తే 48 గంటల్లోగా విచారించి తిరిగి అందజేస్తాం. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కమిటీని సంప్రదించి వివరాలు అందజేస్తే సరిపోతుంది. సీజ్ చేసిన డబ్బు బ్యాంకులో డిపాజిట్ చేస్తే చెక్కు, ట్రెజరీలో డిపాజిట్ చేస్తే డబ్బులు అందజేస్తాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– బి.మోహన్, గ్రీవెన్స్ సెల్ కమిటీ కన్వీనర్

ఒకే నామినేషన్..



ఆర్వోకు నామినేషన్ పత్రం అందజేస్తున్న రాథోడ్ రమేశ్

- ఖానాపూర్‌లో బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేశ్ దాఖలు
- జిల్లాలో రెండో రోజూ అదే తీరు

కైలాస్‌నగర్/బోథ్/ఉట్నూర్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో రెండో రోజైన శనివారం జిల్లాలో ఒకే ఒక నామినేషన్ దాఖలైంది. ఆదిలాబాద్ జిల్లాలో బోథ్, ఆదిలాబాద్(పూర్తి నియోజకవర్గాల)తో పాటు, పాక్షిక నియోజకవర్గాలైన ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఆయా రిటర్నింగ్ అధికారులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లను స్వీకరించారు. అయితే ఆసిఫాబాద్, బోథ్, ఆదిలాబాద్ నియోజకవర్గాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఖానాపూర్‌లో బీజేపీ అభ్యర్థిగా రాథోడ్ రమేశ్ తన తొలిసెట్ నామినేషన్ దాఖలు చేశారు. తన సతీమణి సుమన్ రాథోడ్‌తో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి జీవాకర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆదివారం సెలవు రోజు కావడంతో నామినేషన్ల స్వీకరణ ఉండదు. సోమవారం నుంచి అన్ని నియోజకవర్గాల్లో నామినేషన్ల దాఖలు పుంజుకునే అవకాశముంది.

16న జిల్లాకు సీఎం కేసీఆర్ రాక

- ఆదిలాబాద్, బోథ్‌లో బహిరంగ సభలు

సాక్షి,ఆదిలాబాద్: ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ జిల్లాకు రానున్నారు. ఈ నెల 16న ఆయన జిల్లా పర్యటన ఖరారు అయింది. ఆదిలాబాద్, బోథ్‌లో నిర్వహించే బహిరంగ సభల్లో ఆయన పాల్గొంటారు. ప్రజా ఆశీర్వాద సభల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల్లో ఆయన పర్యటిస్తున్నారు. గురు, శుక్రవారాల్లో నిర్మల్ జిల్లాలో ఆయన పర్యటించిన విషయం తెలిసిందే. తాజాగా ఉమ్మడి జిల్లా పర్యటన ఖరారు కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తుంది.

కాంగ్రెస్ పార్టీ పరిశీలకుల నియామకం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గాల ఏఐసీసీ పరిశీలకులు, ఏఐసీసీ క్లస్టర్ ఇన్‌చార్జీ లను నియమించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు పరిశీలకులను ప్రకటించింది. ఏఐసీసీ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా చెన్నూర్‌కు బి.దేవేంద్రప్ప, బెల్లంపల్లికి శ్రీనివాస్ ఎన్టీ, ఆసిఫాబాద్‌కు జీఎన్.గణేశ్, ఆదిలాబాద్‌కు ఆర్.రాజేంద్రను నియమిస్తూ ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

'విశ్వరూప' మహాసభకు తరలిరండి

బేల: ఈనెల 11న హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ కోరారు. ఈమేరకు శనివారం మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మహాసభ కరపత్రాలు విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సభకు ముఖ్యఅతిథిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జితేందర్, నాయకులు సూర్యకాంత్, రాజశేఖర్, సునీల్, పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

మరో ఐదేళ్లు ఉచిత రేషన్

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయం
- జిల్లాలో 6.40 లక్షల మందికి లబ్ధి
- బియ్యం పంపిణీపై పేదల హర్షం



కైలాస్‌నగర్: ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన ద్వారా నిరుపేదలకు అందించే ఉచిత రేషన్ బియ్యం పథకాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఐదేళ్ల పాటు పొడిగించింది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో 1,91,891 రేషన్ కార్డుల్లోని 6,40,515 మంది నిరుపేదలకు లబ్ధి చేకూరనుంది. వీరికి గాను 3076.261మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించనున్నారు. ప్రధాని నిర్ణయంపై పేదల్లో హర్షం వ్యక్తమవుతుంది.

కోవిడ్ నేపథ్యంలో నిర్ణయం

కోవిడ్ తీవ్రత నేపథ్యంలో ప్రజలు వైరస్ బారిన పడకుండా ఉండేలా కేంద్రం లాక్‌డౌన్ విధించింది. దీంతో నిరుపేదలు ఉపాధి కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీన్ని గుర్తించిన కేంద్రం అలాంటి వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన పథకాన్ని 2020 మార్చిలో ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా తెల్ల రేషన్‌కార్డుదారులకు ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున బియ్యం ఉచితంగా అందజేస్తూ వస్తోంది. వైరస్ తీవ్రత తగ్గుముఖం పట్టినా పేదలకు ఉచిత బియ్యం ఎంతో ప్రయోజనకరంగా ఉండటాన్ని గుర్తించిన కేంద్రం దాన్ని పలుమార్లు పొడిగిస్తూ వస్తోంది. ఇప్పటి వరకు ఏడాది, మూడు నెలలుగా పొడిగించిన కేంద్రం తాజాగా మరో ఐదేళ్ల పాటు పొడిగించనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో పేదలకు మేలు చేకూరనుంది.

ఉత్తర్వులు అందాల్సి ఉంది

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద అందిస్తున్న ఉచిత బియ్యం గడువు పొడిగించినట్లుగా తెలిసింది. అయితే అధికారికంగా ఉత్తర్వులు అందాల్సి ఉంది. అవి అందిన వెంటనే తదనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

– కిరణ్‌కుమార్, డీఎస్‌వో

నేడు జిల్లా స్థాయి కరాటే ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్-14, 17 బాలబాలికల కరాటే ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రెటరీ సీహెచ్ కాంతారావు ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కల క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్ సర్టిఫికెట్‌తో ఉదయం 10గంటలకు ఆర్గనైజర్ దత్తుకు స్టేడియంలో రిపోర్ట్‌చేయాలని సూచించారు. వివరాలకు 90001 27178లో సంప్రదించవచ్చని తెలిపారు.

భద్రత లేదు.. భరోసా కరువు



'సాక్షి' పబ్లిక్ ఎజెండాలో పాల్గొన్న ఆటోవాలాలు

ఆటోవాలా ఎజెండా

- సమస్యల్లో ఆటో డ్రైవర్లు
- యూనియన్లు పట్టించుకోవడం లేదని ఆవేదన
- ప్రభుత్వాలు ఆదుకోవాలని వేడుకోలు

ఆదిలాబాద్/ఎదులాపురం: నిత్యం ప్రజలను ఒక చోటు నుంచి మరో చోటుకు చేర్చేందుకు ప్రైవేట్ వాహనదారులు ఎంతో కీలకం. ప్రజా రవాణా వ్యవస్థ ఉన్నప్పటికీ చిన్నపాటి దూరాల్లో ప్రయాణం చేయడానికి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తుంటారు. ఇందులో ఆటోలకు అధిక ప్రాధాన్యం. ఆటోలు నడపడం ఉపాధిగా చేసుకొని ఎంతో మంది జీవనం సాగిస్తున్నారు. పీపుల్స్ మేనిఫెస్టోలో భాగంగా శనివారం 'సాక్షి' నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆటోవాలాలు పాల్గొని వారి సమస్యలు వెలిబుచ్చారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ బతుకులు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని పేర్కొన్నారు. భరోసా కరువై.. భద్రతలేని జీవనం గడపాల్సిన దుస్థితి ఏర్పడుతుందని వాపోయారు. వారి మాటల్లోనే..

భద్రత లేదు...



2012 నుంచి ఆటో నడుపుతున్నా. ఆటోడ్రైవర్లకు ఎలాంటి భద్రత లేదు. మధ్యలో నాకు హార్ట్ ఎటాక్ వచ్చింది. ఇంటిని తాకట్టుపెట్టి రూ.9 లక్షలు వెచ్చించి ఆపరేషన్ చేసుకోవాల్సిన దుస్థితి. ఆ సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా. అనుకోని ప్రమాదాలతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. భరోసా కల్పించేలా ప్రభుత్వం ఆలోచించాలి.

– షేక్ మాజిద్, ఆదిలాబాద్

ఫైనాన్స్ కట్టడానికే..



20 ఏళ్లుగా ఆటో నడుపుతున్నాను. రోజంతా కిరాయి కొడితే రూ. 500 నుంచి రూ.600 వరకు మాత్రమే వస్తాయి. డీజిల్, ఫైనాన్స్ పోనూ మిగిలేది ఏమి ఉండదు. పొట్టపోసుకోవడానికి సరిపోతుంది. ఇంటి అవసరాల దృష్ట్యా అన్‌సీజన్‌లో ఫైనాన్స్ ఇబ్బందిగా మారుతోంది. మధ్య మధ్యలో ఆరోగ్య సమస్యలు, పిల్లల చదువుకు డబ్బులు వెచ్చించాల్సి వచ్చినప్పుడు అప్పులు తప్పట్లేదు. ప్రభుత్వాలు ఆలోచించి మాకు ప్రోత్సాహకాలు అందించాలి.

– నయీమ్, షాద్‌నగర్, ఆదిలాబాద్

కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి



ఆటోవాలాలను కేవలం రాజకీయాల కోసం వాడుకుంటున్నారు. ఎన్నికల సమయంలోనే మా వద్దకు వస్తూ తర్వాత విస్మరిస్తున్నారు. అకస్మాత్తుగా ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. యూనియన్లు ఉన్నా పట్టించుకోవట్లేదు. కనీసం కార్మికులుగా కూడా గుర్తించడం లేదు. లేబర్‌కార్డులు ఇవ్వడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మా జీవితాలకు భద్రత కల్పించాలి.

– సతీశ్, సప్తగిరి కాలనీ, ఆదిలాబాద్

ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలి



23ఏళ్లుగా ఆటో నడుపుతున్నాను. ఓసారి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాను. అప్పుడు ఎవరు ఆసరాగా నిలవలేదు. మాలాంటి ఆటోవాలాలకు హెల్త్‌కార్డు అందజేయాలి. ప్రభుత్వాలు కార్మికులను పట్టించుకోవడంలో విఫలమయ్యాయి. అలాగే డీజిల్ రేటు పెరగడం వలన ఇబ్బందులు పడుతున్నాం. ఆటోవాలాలకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా ప్రభుత్వాలను కోరుతున్నా, ఇప్పటివరకు మా ఆశ నెరవేరలేదు. కిరాయి ఇళ్లలో ఇబ్బందులు పడుతున్నాం.

– సుధాకర్, రణదీవే నగర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

నేటి నుంచి యూనివర్సిటీ స్థాయి క్రీడా పోటీలు

ఆదిలాబాద్: కాకతీయ యూనివర్సిటీ పరిధి లోని కళాశాలలకు ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ పోటీలు నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రెటరీ ప్రొఫెసర్ టి.సవిత జ్యోతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5, 6వ తేదీల్లో కబడ్డీ, 6, 7వ తేదీల్లో బాస్కెట్‌బాల్ పోటీలు యూనివర్సిటీలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు అర్హత ధ్రువీకరణ పత్రం, ఎస్సెస్సీ మెమో, ఇంటర్మీడియట్, ప్రీవియస్ ఇయర్ స్టడీ మెమో, బోనాఫైడ్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

పలువురిపై కేసు

ఎదులాపురం: ఎన్నికల నిబంధనలు ఉల్లఘించిన పలువురు దుకాణదారులపై శనివారం కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై కలీం తెలిపారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా రాత్రి పది గంటల తర్వాత దుకాణాలు తెరిచి ఉంచకూడదన్నారు. నిఖిల్, మహ్మద్ మాలిక్, జమీల్ ఖాన్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దుకాణదారులు, హోటళ్లు, పాన్‌షాప్‌ల యజమానులు రాత్రి పది గంటల అనంతరం దుకాణాలను తెరిచి ఉంచకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రూ.లక్ష పట్టివేత



పట్టుబడిన వ్యక్తితో పోలీసులు

కుభీర్: మహారాష్ట్ర సరిహద్దులో మండలంలోని సర్వెల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మహారాష్ట్రలోని పాలజ్ గ్రామం నుంచి భైంసా రూ.లక్షతో వస్తున్న రాజేశ్వర్ అనే వ్యక్తి పట్టుపడ్డాడు. నగదుకు సరైన ఆధారాలు చూపకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు ఎస్సై ఎండీ.షరీఫ్ తెలిపారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ద్యాగవాడ చౌరస్తా వద్ద ధర్మాన ఇంట్లో మద్యం బాటిళ్లు శనివారం పట్టుకున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. పక్కా సమాచారంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అతని ఇంట్లో తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 62 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. వీటి విలువ రూ.7 వేలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

మళ్లీ కనిపించిన పులి



రిజర్వాయర్ క్యాంప్ సమీపంలో కనిపించిన పులి

- పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో సంచారం

తాంసి: భీంపూర్ మండలంలోని పెన్‌గంగ నది పరీవాహక ప్రాంతాల్లో పులి సంచారం స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. వారం క్రితం తాంసి(కె), గొల్లఘాట్, పిప్పల్‌కోటి శివారులో పులి సంచరించిన విషయం తెలిసిందే. వరుసగా పశువులపై దాడి చేసి వాటిని హతమార్చిన బెబ్బులి శనివారం సాయంత్రం తాంసి(కె), పిప్పల్‌కోటి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు సమీపంలోకి వచ్చింది. రాత్రి వేళలో స్థానిక రిజర్వాయర్ నిర్మాణ పనులు కోసం ఏర్పాటు చేసిన క్యాంప్ సమీపంలో సంచరించింది. విషయాన్ని క్యాంప్‌లో పనిచేస్తున్న సూపర్‌వైజర్ రాహుల్ గుర్తించి మిగతా సిబ్బందిని అప్రమత్తం చేశాడు. పులిని సెల్‌లో ఫొటోలు తీసి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ హైమద్, బేస్ క్యాంప్ సిబ్బంది అక్కడికి చేరుకొని పులి సంచరించిన ప్రదేశాలను పరిశీలించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలని స్థానికులకు సూచించారు.

పులి దాడిలో ఆవుదూడ హతం

జైనథ్: మండలంలోని హట్టిఘాట్ పంప్‌హౌస్ వద్ద మేత మేస్తున్న ఆవుల మందపై పులి శనివారం దాడి చేసింది. ఈ ఘటనలో కోర్టా గ్రామానికి చెందిన నందెడపు బాపుకు చెందిన ఒక ఆవు దూడ మృతి చెందగా, అన్నెల లింగన్న, పాలెపు దేవన్నకు చెందిన రెండు ఆవులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆవుల మందను అన్నెల అశోక్, ఏముల విఠల్ హట్టిఘాట్ పంప్‌హౌస్ వైపు మేతకు తీసుకెళ్లారు. మధ్యాహ్న సమయంలో మేత మేస్తున్న మందపై పులి ఒక్కసారిగా దాడిచేసింది. దీంతో ఆవులు భయంతో పరుగు తీశాయి. కొంత దూరంలో ఉన్న అశోక్, విఠల్ పులిని చూసి బిగ్గరగా కేకలు వేశారు. అప్పటికే పులి ఒక ఆవుదూడను చంపి నోట కరుచుకొని వెంట తీసుకెళ్లింది. ఈ దాడిలో మరో రెండు ఆవులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న రైతులు లబోదిబోమన్నారు. తమకు పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఆశపడ్డాడు.. పట్టుబడ్డాడు..

- రూ.8వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జూనియర్ అసిస్టెంట్
- సహకరించిన ప్రైవేట్ అసిస్టెంట్ రాజు
- ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న అధికారులు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు



లంచం తీసుకుంటూ పట్టుబడ్డ జూనియర్ అసిస్టెంట్ అరుణ్‌కుమార్, ప్రైవేట్ అసిస్టెంట్ రాజు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ శనివారం దాడిచేశారు. దీంతో ఒక్కసారిగా అలజడి రేగింది. ఏసీబీ అధికారులు దాడితో సిబ్బంది ఉలిక్కిపడ్డారు. బాధితుడు తన తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరిట గిఫ్ట్ డీడ్ చేసేందుకు జూనియర్ అసిస్టెంట్ అరుణకుమార్ రూ.8 వేలు ఇస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం చాక్‌పల్లి గ్రామానికి చెందిన సయ్యద్ కరీం తన తండ్రి పేరు మీద ఉన్న ఆస్తిని గిఫ్ట్ డీడ్ చేసుకునేందుకు గతనెల 31 న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చాడు. సబ్ రిజిస్ట్రార్‌ను కలువగా జూనియర్ అసిస్టెంట్‌ను కలవమని చెప్పారు. దీంతో కరీం జూనియర్ అసిస్టెంట్ అరుణ్‌కుమార్‌ను కలిశారు. పని జరగాలంటే రూ.8 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో కరీం ఈనెల 2న ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు కరీం శనివారం కార్యాలయంలో రూ.8 వేలు లంచం ఇస్తుండగా.. జూనియర్ అసిస్టెంట్ అరుణ్‌కుమార్, ప్రైవేట్ అసిస్టెంట్ రాజును పట్టుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ఇతరుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో విచారణ చేస్తున్నామని ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు. అరుణ్‌కుమార్ గతంలో కూడా స్టాంపుల అవకతవలక విషయంలో సస్పెండ్ అయినట్లు సమాచారం.

గుడుంబా స్థావరాలపై దాడులు



దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కడెం: మండలంలోని లింగాపూర్, మాసాయిపేట్ గ్రామల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఎనిమిది లీటర్ల గుడుంబా సీజ్ చేసి, 2200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రమేశ్ తెలిపారు.



పట్టుకున్న గుడుంబాతో ఎక్సైజ్ అధికారులు

గుడుంబా పట్టివేత...

దస్తురాబాద్: మండలంలోని మున్యాల తండా, ఎర్రగుంట, రేవోజీపేట, చెన్నూర్, బుట్టపూర్ గ్రామాల్లో శనివారం ఎక్సైజ్ అధికారులు సోదాలు నిర్వహించారు. 20లీటర్ల గుడుంబా, 2500లీటర్ల బెల్లం పానకం పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రమేష్ తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది ముత్యం, నిరోషా, కల్పన, వెంకటేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తలనొప్పి భరించలేక యువతి ఆత్మహత్య



వైష్ణవి మృతదేహం

సారంగపూర్: మండలంలోని పాట్య గ్రామానికి చెందిన అలుగొండ వైష్ణవి(17) తలనొప్పి బాధ భరించలేక ఆత్మహత్య చేసుకుందని సారంగాపూర్ ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. కొన్నేళ్లుగా సమస్యతో బాధపడుతోంది. చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడం, ఖరీదైన చికిత్స చేయించుకునే స్థోమత లేకపోవడంతో శనివారం ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వైష్ణవి తండ్రి దత్తన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



లక్ష్మణ్ (ఫైల్)

నేరడిగొండ: అప్పు తీర్చేమార్గం లేక రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొందిడి గ్రామాని కి చెందిన జాదవ్ లక్ష్మణ్ (48) గతేడాది ప్రైవేట్‌గా దాదాపు రూ.3లక్షల వరకు అప్పు చేశాడు. పంట సాగుతో పాటు కొడుకు పెళ్లి, అలాగే ఇంటిని నిర్మించుకున్నాడు. తనుకున్న నాలుగున్నర ఎకరాల్లో సాగు చేసిన సోయా, మక్క పంటలు సరిగా పండకపోవడంతో చేసిన అప్పు తీర్చలేనని మనస్తాపం చెంది గత నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

అడవిపందుల దాడిలో పంట ధ్వంసం



కొత్త మద్దిపడగలో ధ్వంసమైన వరిపంట

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామానికి చెంది దుల్లె వెంకటేశ్ వరి పంటపై శుక్రవారం రాత్రి అడవి పందులు దాడి చేశాయి. మూడు ఎకరాలు సాగు చేస్తే, పందుల దాడిలో సుమారు ఎకరం మేర పంట ధ్వంసమైందని బాధిత రైతు తెలిపాడు. పగలు కోతులు, రాత్రిళ్లు వన్యప్రాణులతో నష్టపోతున్నామని, ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని కోరాడు.

కొలాం భాషను కాపాడాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సచిన్



నివాళులర్పిస్తున్న సచిన్, ఆదివాసీ నాయకులు

ఎదులాపురం: అంతరించిపోతున్న ఆదివాసీ తెగలు, వారి భాషలను కాపాడాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో శనివారం నిర్వహించిన కుమురం సూరు 26వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సూరు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కుమురం భీంతో పాటు కుమురం సూరు ఆదివాసీల కోసం నిజాం ప్రభుత్వ దౌర్జన్యంపై పోరాడారన్నారు. అంతరించిపోయే స్థితికి చేరిన కొలాం భాషాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవులు, అర్జున్, మహేశ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న, కిరణ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానం పెంచుకోవాలి

నిర్మల్ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు శాస్త్ర, సాంకేతికతలపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని జేవీఎన్‌ఆర్ ఉన్నత పాఠశాలలో శనివారం సైన్స్ డ్రామా ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైన్స్‌పై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని నాటికలు ప్రదర్శించారు. 'మానవజాతి ప్రయోజనం కోసం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. మూఢ నమ్మకాలు మన జీవితాన్ని ఏ విధంగా ప్రభావం చేస్తాయో తద్వారా ఏరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో విద్యార్థులు వివరించారు. చిరుధాన్యాల ఆవశ్యకత వాటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి వచ్చే ప్రయోజనాలు, మానవ జీవితంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం యొక్క ఉపయోగం, ఆహార భద్రత అనే అంశాలపై విద్యార్థులు వివిధ ప్రదర్శనలు నిర్వహించారు. జిల్లాలోని 15 పాఠశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వీరిని డీఈవో రవీందర్‌రెడ్డి అభినందించారు. న్యాయ నిర్ణేతలుగా రాష్ట రిసోర్స్ పర్సన్ నారాయణవర్మ వ్యవహరించారు. ఇందులో సైన్స్ సమన్వయకర్త బచ్చు శ్రీనివాస్, జిల్లా పరీక్షల అధికారి పద్మ పాల్గొన్నారు.

ఎన్నికల నిఘా నేత్రాలు

- బోథ్ నియోజకవర్గంలో మూడు ప్రత్యేక వాహనాలు
- 24 గంటల పాటు పర్యవేక్షణ
- జిల్లా, రాష్ట్ర ఎన్నికల అధికారుల కార్యాలయాలకు అనుసంధానం



ఇచ్చోడలో పర్యటిస్తున్న ఎన్నికల నిఘానేత్ర వాహనం

ఇచ్చోడ: ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిఘా కట్టుదిట్టం చేసింది. తొలిసారిగా వాహనాలకు ప్రత్యేకంగా నిఘానేత్రాలు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఎన్నికల అధికారులు 24 గంటల పాటు పర్యవేక్షిస్తున్నారు. బోథ్ నియోజకవర్గంలో మూడు మండలాలకు ఒక వాహనం చొప్పున కేటాయించారు. మొత్తం మూడు వాహనాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రోజంతా తనిఖీ బృందాలతో పర్యవేక్షిస్తున్నారు. మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో షిఫ్టులో సివిల్ పోలీసు అధికారితో పాటు కెమెరామెన్ అందుబాటులో ఉంటారు. వాహనానికి అమర్చిన సీసీ కెమెరా ద్వారా 50 మీటర్ల దూరంలో ఉన్న దృశ్యాలను చిత్రీకరించడంతో పాటు సౌండ్‌ను కూడా రికార్డు చేస్తుంది. వీటిని జిల్లా, రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయాలకు అనుసంధానం చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మద్యం, డబ్బు అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎన్నికల సంఘం ఈ చర్యలు తీసుకుంటుందని వారు వెల్లడించారు.

జంగ్ తెలంగాణ

బజ్జీలు వేస్తూ.. ఓట్లు అడుగుతూ..



బోథ్: ఓటర్లను ఆకట్టుకోవడానికి అభ్యర్థులు వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ ఓ హోటల్‌లో శనివారం ఇలా బజ్జీలు వేస్తూ ప్రచారం చేపట్టారు. అనంతరం వ్యాపారులు, దుకాణదారులను కలిసి ఓటు అభ్యర్థించారు.

గుర్రమెక్కి వచ్చేత్తపా..



అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముధోల్ బీజేపీ అభ్యర్థి రామారావు పటేల్ తానూరు మండలంలో శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గుర్రంపై ఎక్కి ఇలా కాసేపు ఓట్లు అడిగారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

- తానూరు

అసెంబ్లీ బరిలో గల్ఫ్ సంఘాల నేతలు

- ఆలిండియా ఫార్వార్డ్‌బ్లాక్ తరఫున ముగ్గురు..
- ఇండిపెండెంట్‌గా మరొకరు పోటీ



ఎన్నికల్లో పోటీ చేస్తున్న గల్ఫ్ కార్మిక నేతలు

నిర్మల్‌ఖిల్లా: గల్ఫ్ కార్మిక సంఘాల నేతలు రానున్న శాసనసభ ఎన్నికల బరిలో నిలువనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీపడనున్నట్లు పేర్కొంటున్నారు. గల్ఫ్ కార్మికులకు సరైన ప్రాధాన్యత ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో ఉన్నట్లు ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల స్పష్టం చేశారు. భారత స్వతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ తరఫున వేములవాడ నియోజకవర్గం నుండి గుగ్గిళ్ల రవిగౌడ్, కోరుట్ల నియోజకవర్గం నుంచి చెన్నమనేని శ్రీనివాసరావు, నిర్మల్ నియోజకవర్గం నుంచి స్వదేశ్ పరికిపండ్ల ఇప్పటికే బీఫారాలు పొందారు. సింహం గుర్తుతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మరోవైపు సిరిసిల్ల దొరికెన కృష్ణ అభ్యర్థిత్వాన్ని ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ పరిశీలిస్తోంది. సమీకరణాలు అనుకూలించకున్నా స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉండనున్నట్లు కృష్ణ తెలిపారు.

డీఎల్ఎస్ఏ ద్వారా ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వరప్రసాద్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు కార్యాలయంలో మాట్లాడారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రాజుగూడా తండాను సందర్శించడం జరిగిందన్నారు. గత ఏడాది పారుబాయి అనే గిరిజన మహిళా పాపకి జన్మనిచ్చి మరణించిందని, 11 నెలలుగా జిల్లా న్యాయసేవా సంస్థ ద్వారా పాప బాగోగులు చూస్తున్నామన్నారు. నిత్యావసర సరుకులు, బట్టలు అందించడం జరిగిందన్నారు. అలాగే గ్రామానికి రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అధికారుల సహకారంతో కృషి చేస్తామన్నారు. అనంతరం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లోహర గ్రామంలో ఉచిత న్యాయ సేవ సదస్సు నిర్వహించామన్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం డీఎల్ఎస్ఏను సంప్రదించాలని కోరారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ప్రగతి



పురస్కార గ్రహీతలతో ఆర్ఎం, అధికారులు

- ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్

ఆదిలాబాద్: ఆర్టీసీ ఉద్యోగులంతా సమష్టి కృషితో ముందుకు సాగినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన రీజినల్ లెవెల్ ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు సేవా దృక్పథంతో ఆలోచిస్తూ నిరంతరం అంకితభావంతో పని చేయాలన్నారు. సంస్థను లాభాల బాటలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అత్యుత్తమ సేవలు అందించిన 28 మంది ఉద్యోగులకు పురస్కారాలతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అలాగే రీజియన్ పరిధిలో ఆదిలాబాద్ డిపో అగ్రస్థానంలో నిలవగా, డీఎం కల్పన ప్రోత్సాహకాన్ని అందుకున్నారు. ఇందులో డిప్యూటీ ఆర్ఎంలు ప్రణీత్, ప్రవీణ్, ఆసిఫాబాద్ డిపో మేనేజర్ శ్రీధర్ ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

మీరూ లాయర్, ఇంజనీర్, ప్రొఫెసర్ కావాలనుకుంటున్నారా? LLB, B.Tech, M.Tech, M.Sc అగ్రి, MBA, Ph.D(All). Cont: 7013038197 (కొన్ని సీట్లు మాత్రమే) [W-1220937]

REAL ESTATE

FLAT FOR SALE

"0" Kms from SEZ Financial Dist, Gachibowli, Hyd. Luxury Gated Apartments, 2 / 3 / 4 BHK Flats for Sale. Near Google, Amazon etc., Ph : 9849025003. [HA-11785]

SERVICES

Finance Services

సిరి అసోసియేట్స్ అన్ని రకాల రుణాలు, పర్సనల్ హౌసింగ్ మార్ట్ గేజ్ ఓపెన్ ప్లాట్స్ పై కూడా సిబిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సంప్ర: సెల్: 9666142226 [W-1220931]

BUSINESS OFFER

Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 6300088368 [H-193273]

We Are Ready to Invest Long Term Projects All over The World: + 91 8754809650. [HA7035]

WANTED

విజయవాడలో A/C & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1206681]

మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [M-1221903]

రామకృష్ణ గ్రూపు, (TS No.1) HYD, VJA, శ్రీమంతుల ఇళ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. TS & AP అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 92814 52838, 82474 49036. [B-1206468]

ప్రముఖ బ్యాంకు DSAల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి M/F స్టాఫ్ ఆ.కా.ను. అ: ఇంటర్, డిగ్రీ జీ: 17K to 35K ఇంట్రెస్ట్ ఉన్న వారు వెంటనే డిటేల్స్ వాట్సాప్ చేయండి. 9885426966 [H-193239]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీతం: 18K Ph: 9848571888/9640400073 [H-189348]

షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడి వంట మనుషులు, వార్డ్ బాయ్స్, ఆయాలు, భార్యాభర్తలు, గార్డెన్ పని & ఆవులు చూసుకొనుటకు వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-12454]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,